ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025



చొంపిలో డ్రెయినేజీ నిర్మించాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ మండలంలోని చొంపి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేశారు. డ్రైనేజీ లేక కురుస్తున్న వర్షాలకు వరదనీరుతో పాటు ఆయా గృహాల్లో వాడే వ్యర్థ నీరు సీసీ రోడ్డు పైనే పారుతూ, ఎక్కడికక్కడ నిలిచి పోతుంది. దీంతో దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి అనేక రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మించాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని గిరిజనులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి చొంపి గ్రామంలో డ్రైనేజీ నిర్మించి తమ కష్టాలు తీర్చాలని గిరిజనులు డిమాండ్ చేశారు.



రోడ్డుపై మురుగు నీరు



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, వేదికపై సురేంద్ర, అప్పలనర్స, గంగరాజు తదితరులు

హైడ్రోపై నిరసన గళం

- గుమ్మకోటలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ప్రాజెక్టులు కడతారా ? : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్/అనంతగిరి

తమను జలసమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ఆదివారం అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో ఆదివాసీలు నిరసన గళం వినిపించారు. వందలాది మంది భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడారు. గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి అదాని, నవయుగ, శిరిడీసాయి, మేఘా వంటి బడా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 2, 13, 51 జిఓలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టులతో ఉద్యోగాలు వస్తాయని మాయమాటలు చెప్పొద్దన్నారు. గిరిజన అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ముందు గ్రామాలకు రోడ్లు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివాసీలను ఎలా మోసగిస్తున్నదీ ఆమె వివరించారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ హైడ్రో ప్రాజెక్టుల పేరుతో గిరిజన గ్రామాల్లోకి కంపెనీల ఏజెంట్లు అడుగుపెడితే తరిమికొడతామని హెచ్చరించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు చేస్తున్న ప్రతి రైతుకు పది ఎకరాలకు తగ్గకుండా పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ఆ పట్టాలపై రకరకాల సాంకేతిక కారణాలు చెప్పి ప్రభుత్వం తప్పించుకుంటూ అదానీ, నవయుగ వంటి ప్రైవేటు కంపెనీలకు భూములను ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులపై కలెక్టర్, గిరిజన శాఖ మంత్రి మాయమాటలు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పార్టీల జెండాలు పక్కనపెట్టి గిరిజనులంతా ఒక్కటే అజెండాతో ముందుకు సాగి హైడ్రో ప్రాజెక్టులను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం నాయకురాలు దీసరి దేముడమ్మ, హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్లు మజ్జి సురేష్ కుమార్, కొర్ర స్వామి, వెంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, అనంతగిరి మండల నాయకులు సోమెల నాగులు, సతాబి సర్పంచ్ రామయ్య, జె.వెంకటరమణ, ఆర్.శ్రీను, ఈశ్వరరావు, టి.అప్పలస్వామి, మాజీ ఎంపిటిసి పి.రామకృష్ణ, పోరాట కమిటీ నాయకులు కె.జగన్నాథం, బాబూరావు, రామచందర్, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు, గిరిజనులు

మండలాన్ని యూనిట్‌గా తీసుకుని..

పోలవరం పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం: పోలవరం నిర్వాసితులకు ఇస్తామన్న పరిహారం కూనవరం మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం మొత్తం ఇవ్వాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. పార్టీ మండల కమిటీ సమావేశం పాయం సీతారామయ్య అధ్యక్షతన మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో ఆదివారం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత 41 కాంటూరు ప్రయారిటీ గ్రామాలకు వచ్చే నెల పరిహారం జమ చేస్తామని చెబుతున్నా, గతంలో 41 కాంటూరు గ్రామాల నిర్వాసితులకు పూర్తి పరిహారం ఇవ్వలేదని కొంతమందికి వస్తే కొంతమందికి పరిహారం అందక ఇబ్బంది పడ్డారన్నారు. మొదటి పరిహారం ఇచ్చిన గ్రామాల ప్రజలను ఇంతకాలం ఇబ్బందులకు గురిచేసిన విధంగా కాకుండా కూనవరం మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పునరావాసం పరిహారం మొత్తం ఇవ్వాలని కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతకు పరిహారం పునరావాసం సర్వే చేసి వచ్చే నెలలో ఇస్తామంటున్న ప్రభుత్వ ప్రకటన ప్రకారం వీరికి కూడా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కమిటీ నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలి

9న చింతూరులో ఆదివాసీ నిరుద్యోగుల బహిరంగ సభ

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో రేఖపల్లిలో వచ్చే జనవరిలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ప్రకటించడాన్ని ఆహ్వానిస్తూ, డిఎస్సి నోటిఫికేషన్‌కు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు షెడ్యూల్డ్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని రాష్ట్ర ఆదివాసీ జెఎసి జిల్లా చైర్మన్ రామారావుదొర డిమాండ్ చేసారు. జిఒ నంబర్ 3 పునరుద్ధరణలో భాగంగా షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్టసాధన భవిష్యత్ ఐక్యఉద్యమ కార్యాచరణ కోసం ఆదివాసీ నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేఖపల్లిలో సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎపి ఆదివాసీ జెఎసి ఎఎస్ఆర్ జిల్లా చైర్మన్ రామారావు దొర మాట్లాడుతూ క్రితం గత ఎన్నికల్లో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చిన హామీ జిఒ 3 పునరుద్ధరణ ప్రక్రియ అని మభ్యపెట్టారని ఇప్పుడు మళ్ళీ జనవరిలో మరో డిఎస్‌సి అంటున్నారని విమర్శించారు. జిఒ పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారని సూటిగా ప్రశ్నించారు. 2026 జనవరి డిఎస్‌సి కన్నా ముందే 'షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసి ప్రత్యేక ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. నియామకాల చట్టం ప్రక్రియకు అడ్డుపడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీని తొలగించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 9న నిర్వహించ నున్న బహిరంగ సభకు రాజకీయపార్టీలకు అతీతంగా సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు మడివి నెహ్రూ, ఆదివాసీ జెఎసి డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, కాకా సీతరామయ్య, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పులి సంతోష్, సీసం సురేష్, పూనెం ప్రదీప్, ఎంపిపి కారం లక్ష్మి, ఆదివాసీ జెఎసి నాయకులు చింతూరు చైర్మన్, పొడియం.రామకృష్ణ, ఊయక రాంప్రసాద్, పులి అశోక్, పాయం రామారావు తదితరులు పాల్గొన్నారు.



రేఖపల్లిలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పవర్ జెఎసి ద్రోహం

ప్రజాశక్తి-సీలేరు: పవర్ జెఎసి నాయకులు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తీరని ద్రోహం చేశారని సీలేరు సిఐటియు గౌరవ అధ్యక్షులు సిఐటియు నాయకులు ఎం.రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆదివారం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు న్యాయ మైన కోర్కెలు యాజమాన్యంతో చర్చలు జరిపి పరిష్కరించకుండా పవర్ జెఎసి నాయకులు నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు 27 వేల మంది ఉన్నారని కార్మికులకు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాలు రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంట్రాక్ట్ కార్మికులకు ఏ విధంగా డైరెక్ట్ పేమెంట్ ఇచ్చారో అదే విధంగా ఎపిలో కాంట్రాక్ట్ కార్మికులకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మాయ మాటల్లో పడి కార్మికులకు జెఎసి నాయకులు అన్యాయం చేయొద్దని అలాగే కాంట్రాక్ట్ కార్మికులు జెఎసి నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని సూచించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలని యాజమాన్యం ప్రభుత్వ పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్కే సుభాన్

బస్ షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలోని కాకరపాడు మీదుగా నూతన జాతీయ రహదారి 516ఇ రావడంతో కాకరపాడు సెంటర్ మూడు రోడ్ల జంక్షన్ కావడం వల్ల నర్సీపట్నం నుండి, కేడిపేట, ఇటు తూర్పు గోదావరి జిల్లా ప్రాంతంలో నుండి వచ్చిన ప్రతి ప్రయాణికుడు కాకరపాడు సెంటర్‌లో దిగి ఏదో వాహనం కోసం ఎదురు చూస్తూ ఉండాల్సి వస్తోంది. ఇక్కడ బస్సుషెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాకరపాడు ప్రధాన కూడలిలో బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జిఎంవలస - కుండాడ రోడ్డు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం జిఎం వలస జంక్షన్ నుండి కుండాడ గ్రామం వరకూ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. కుండాడ పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో సుమారు 500 పైగా కుటుంబాల ప్రజలు ఉన్నారని వారు ప్రతి అవసరానికీ మారేడుమిల్లి రావాల్సి వస్తోందని కుండాడ నుండి జియంవలస జంక్షన్ వరకూ రోడ్డు పనులు సగం మాత్రమే చేశారని మెటల్ వేసి సుమారు రెండు సంవత్సరాలు దాటుతున్న నేటికీ పూర్తి చేయలేదన్నారు.

మెటల్ వేసి వదిలేయడం వల్ల మోటార్ సైకిల్‌పై వెళ్తున్నవారు ప్రమాదాల గురవుతున్నారని ప్రజలకు కనీస అవసరమైన రోడ్డు పూర్తి చేయడంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు గోము దుర్గ మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలో ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న కుమార్

పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని టిడబ్ల్యూటియు రాష్ట్ర, అల్లూరి, విజయనగరం జిల్లాల శాఖల నాయకులు ఆర్.సూర్యనారాయణ, కె.రామారావు, ఒ.విజేంద్రనాథ్ కోరారు. ఆదివారం సాలూరులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పండిట్, పిఇటి పోస్టులను ఉన్నతీకరించేందుకు ఆర్థిక శాఖ అనుమతికి చొరవ చూపిన మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. ప్రభుత్వం తక్షణమే ఉన్నతీకరణ ఉత్తర్వులు ఇచ్చేలా కృషి చేయాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పని చేయుచున్న సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు అర్హత కలిగిన వారిని క్రమబద్ధీకరించాలని విన్నవించామని తెలిపారు. టిడబ్ల్యూ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ గా పనిచేస్తున్న వారిని జిల్లా విద్యాశాఖాధికారులుగా ప్రమోషన్‌లు కల్పించేందుకు చొరవచూపాలని, ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని కోరినట్లు తెలిపారు. పిఇటి, పండిట్ సంఘం ప్రతినిధులు వెంకటరావు, కిరణ్, ప్రభాకర్, రాజు, మనోరంజన్, నాగసూర్య మంత్రిని కలిసిన వారిలో ఉన్నట్లు వారు తెలిపారు.



మంత్రిని అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

కల్తీ డీజిల్ విక్రయాలపై డ్రైవర్ల ఆందోళన



ప్రశ్నిస్తున్న వాహన డ్రైవర్లు

ప్రజాశక్తి-హుకుంపేట:- మండల కేంద్రంలోని హిందూస్థాన్ పెట్రోలియం బంకులో కల్తీ డీజిల్ విక్రయించడంతో మూడు కొత్త టిప్పర్ వాహనాల ఇంజిన్లు దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ డ్రైవర్లు ఆదివారం బంకు వద్ద ఆందోళన చేపట్టారు. వాహనదారుల వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం కొత్త టిప్పర్ వాహనాన్ని కొనుగోలు చేసిన వంతల కామేశ్వరరావు శనివారం హుకుంపేట హెచ్‌పీ బంకు వద్ద డీజిల్ వేయించుకున్నారు. తర్వాత పది కిలోమీటర్ల దూరంలో వాహనం ఆగిపోయిందని తెలిపారు. షోరూమ్ మెకానికులు పరిశీలించగా కల్తీ డీజిల్ కారణంగా ఇంజిన్ దెబ్బతిన్నట్లు తేలిందని తెలిపారు. డ్రైవర్ తామర్ల రమేష్ మాట్లాడుతూ, బంకులో తాను రూ 7300 డీజిల్ , పాంగి లైకొన్ రూ 3000 డీజిల్ కొట్టించగా వాహనాలు కొద్దిదూరంలోనే ఆగిపోయాయని తెలిపారు. బంకు సిబ్బంది స్పందించకపోవడంతో వాహనదారులు ఆదివారం బంకు వద్ద భారీగా ఆందోళనకు దిగారు. ప్రభుత్వ జీసీసీ బంకులో కూడా కల్తీ డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వ బంకుల్లోనే కల్తీలు జరుగుతుంటే ప్రజలకు న్యాయం ఎక్కడ జరుగుతుందన్నారు. అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.. డీజిల్ కల్తీతో ఆగిపోయిన వాహనాలకు జిసిసి యాజమాన్యం మరమ్మతులు చేసి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పాడేరు:

ప్రజలందరూ ఆనందాల దీపావళి జరుపుకోవాలని కోరుతూ, జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు.ఈ శుభ సందర్భం జిల్లాలోని ప్రతి ఇంట్లో సంతోషాన్ని, సంపదను, సుఖశాంతులను నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచు కుని శబ్ద, వాయు కాలుష్యం తక్కువగా ఉండే గ్రీన్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు.



డుంబ్రిగుడలో భారీ వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి తెల్లవారు వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఆ తరువాత ఉదయం పదకొండు గంటల వరకు గ్యాప్ ఇచ్చి మధ్యాహ్నం భారీగా కురిసింది.దీంతో పర్యాటక ప్రాంతం చాపరాయి జలపాతం ను తిలకించడానికి వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి



సదస్సుకు హాజరైన పలు సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి- విఆర్‌పురం: మెగా డిఎస్‌సి ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ నిరుద్యోగులకు దగా డిఎస్‌సిగా మారిందని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్ర బాబు ఇచ్చిన హామీ అమలు చేయాలని ఏజెన్సీలో ఉద్యోగ ఉపాధ్యాయ నియామక చట్టం చేసి ప్రత్యేక ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రస్థాయి సదస్సు నిరుద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విఆర్‌పురం ఎఎస్‌డిఎస్ కార్యాలయంలో నిర్వహించారు. పాయం వెంకటేష్, గొర్రె మీనా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భవిష్యత్ కార్యక్రమంపై సుదీర్ఘ చర్చ జరిగింది. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల కార్యదర్శి పూనం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి ఆదివాసీ గ్రామంలో సదస్సు ఏర్పాటు చేసి నియోజకవర్గ స్థాయిలో సభలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు, కెఆర్‌పురం ఐటిడిఎల నుంచి నిరుద్యోగులు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల వారు హాజరయ్యారు. సదస్సులో ప్రజా ప్రతినిధులు ఎంపిపి కారం లక్ష్మి, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

'రోడ్ల మరమ్మతులు చేపట్టాలి'

ప్రజాశక్తి-ఎటపాక: ధ్వంసమైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఆదివారం గొల్లగట్ట గ్రామంలో పులుసు బాలకృష్ణ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్లపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని గాలికి వదిలేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా రోడ్ల మరమ్మతులు చేయలేదని, కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. ధ్వంసమైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని కన్నాయిగూడెం నుండి ఎటపాక రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా ఉందని, నెల్లిపాక నుండి మురుమూరు వరకూ రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయన్నారు. అంతర్గత రహదారులు కూడా దెబ్బతిన్నాయని వాటిని పునరుద్ధరించాలని, కొత్తగా సిసి రోడ్లు వేయాలని కోరారు. రోడ్లు త్వరగా నిర్మించుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్‌దొర, మండల కమిటీ సభ్యులు బుద్దుల భద్రయ్య, సవలం రాము, పూనెం వెంకటరావు, గద్దల హుస్సేన్, కారం జయమ్మ, పొడియం రత్తమ్మ పాల్గొన్నారు.



చలి దుస్తులను కొనుగోలు చేస్తున్న గిరిజనులు


జోరుగా చలి దుస్తుల విక్రయాలు

ప్రజాశక్తి - హుకుంపేట

మండల కేంద్రంలోని శనివారం వారపు సంతలో చలి దుస్తుల విక్రయాలు జోరుగా సాగాయి. ఈ నెలలో చలి సీజన్ ప్రారంభమవడంతో గిరిజన ప్రాంతాల్లో చలి ప్రభావం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గిరిజనులు చలి నుంచి రక్షణ కోసం చలి దుస్తులు, స్వెటర్లు కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు. సరసమైన ధరల్లో దుస్తులు విక్రయించడంతో రైతులు, కూలీలు, స్థానికులు కొనుగోలు చేశారు. హుకుంపేట మండల వారపు సంతలో ప్రతి శనివారం వివిధ రకాల వస్తువులు విక్రయిస్తారు. ఈ సారి చలి ప్రభావం కారణంగా చలి దుస్తుల విక్రయాలు ప్రధాన ఆకర్షణగా మారాయి. వ్యాపారులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కొత్త డిజైన్లలో దుస్తులను అందుబాటులో ఉంచారు. గిరిజన కుటుంబాలు చలి కాలానికి ముందుగానే దుస్తులు కొనుగోలు చేస్తున్నారు.

'ఎంపిడిఒ' ప్రాంగణంలో మురికి కుంట

- దోమలు ఉధృతితో ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు
- బర్రెలు, పందులకు ఆవాసంగా మారిన వైనం



మురికి కుంటలో ఉన్న గేదెలు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం వెనక భాగంలో మురికి కుంటగా ఏర్పడింది. వర్షం పడిన ప్రతిసారీ ఇక్కడ నీరు నిల్వపోయి చెత్త, మురుగుతో కలసి మురికికుంటలా మారింది. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల ఉధృతి పెరిగి పోవడంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం వంటి ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయం పరిసరాలు ఇలా చెత్తతో నిండిపోయి మురికి కూపంలా మారడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం వెనక ఉన్న ఖాళీ స్థలాన్ని ఎప్పుడూ శుభ్రం చేయకపోవడం, నీరు వెళ్లే డ్రైనేజీ లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచి మురుగు చెరువులా మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు. మండల ప్రజలకు సేవలు అందించే కేంద్రం ఇలా ఉంటే, గ్రామ పంచాయతీ స్థాయి పరిశుభ్రత పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఇదే ప్రాంగణంలోనే ఆగస్టు 15, జనవరి 26 వంటి దినాల్లో జాతీయ జాతీయ జెండాలను ఎగురవేయడం జరుగుతుంది. మరో వైపు ఈ ప్రదేశం బర్రెలు, పందులకు ఆవాసంగా మారింది. అవి తిరగడం వల్ల చెత్త మరింత పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయ సిబ్బంది వాహనాలు నిలిపేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసి అనేకసార్లు మండల అధికారులకు విన్నవించినప్పటికీ దానిని మెరుగు పర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు వెంటనే స్పందించి మురుగు నీటిని తొలగించి, స్థలాన్ని మట్టితో పూడ్చి శుభ్రపరచాలని, శానిటేషన్ విభాగం క్రమం తప్పకుండా పరిశుభ్రత కొనసాగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు



నిందితులతో పోలీసులు

మూడున్నర కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మూడున్నర కిలోల ఎండు గంజాయి పట్టుబడిందని స్థానిక ఎస్సై షణ్ముఖరావు తెలిపారు, ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిగరువు నుండి జిమాడుగుల వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మూడున్నర కిలోలు ఎండు గంజాయి, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.17500 ఉంటుందన్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



మాట్లాడుతున్న త్రినాథ్

పడవలను పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు

మండలంలోని సుజన కోట గ్రామ పంచాయతీ కుమ్మరిపుట్టు గెడ్డను ఆదివారం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర త్రినాథ్, మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను, గిరిజన సంఘం మండల నాయకులు సొలగం గాసిరం దొర, పాంగి భీమరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, సుజనకోట గ్రామ పంచాయతీ కుమ్మరిపుట్టు, సుజనపేట, బీటా, వనుగుపుట్టు, తోటాపుట్టు, సంకిడిగొంది, నర్సుపుట్టు, మడులపుత్తు, తలభుతోట, గొడ్డిపుట్టు గ్రామాలతో పాటు ఏనుగురాయి పంచాయతీ గాదెల బురుగు, అల్దముల, గిద్దులపుట్టు, నడుమూరు గ్రామాల ఆదివాసి గిరిజన ప్రజలు మండల కేంద్రంలో చేరేందుకు నాటు పడవల సహాయంతో కుమ్మరిపుట్టు వాగు వద్ద తరచు ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు. ప్రయాణానికి సౌకర్యార్థమైన బోట్లను ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, సుజనకోట గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన మత్స్యకారులకు పడవలు, వలలు పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వేటకు వెళ్లిన గిరిజన మత్స్యకారులు ప్రమాదవసత్తు మృతి చెందితే 10 లక్షల ఎక్స్ గ్రేసియా ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కుమ్మరపుట్టు వాగు వద్ద వంతెన నిర్మాణానికి నివేదికలను పంపించాలని కోరారు.

హైడ్రో ప్రాజెక్టులతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కరీముఖి పుట్టు గ్రామ పంచాయితీ పరిధిలోని నందిమెట్ట గ్రామంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి నారాయణ, జీనబంధు, జి.సీతారాం లు ఆదివారం పర్యటించారు. నందిమెట్ట గ్రామ ప్రజలతో జి నారాయణ మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా రద్దు చేసే వరకు ప్రజలు చైతన్యం అవ్వాలని పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో వేలాది కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. వ్యవసాయ సాగు భూములు నష్టపోయే పరిస్థితి ఉందని అవగాహన పరిచారు. మండల కమిటీ సభ్యుడు జి జీనబంద్ మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో జీవో 3 రద్దు కావడంతో యువతకు ఇటీవల నియామకాలు జరిపిన మెగా డీఎస్సీలో అతి తక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. జీవో 3పై ఆర్డినెన్స్ జారీ చేసి ప్రత్యామ్నాయమైన జీవోను విడుదల చేయాలన్నారు. సీతారాం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఐటీడీఏ పరిధిలోని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు గిరిజన నిరుద్యోగ యువతతో భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చంటిబాబు , రామ్మూర్తి భగత్ రాం గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

అండర్ 19 పోటీల్లో సత్తా చాటిన రమేష్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- చోడవరంలో ఈనెల 18న జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 19 వాలీబాల్ పోటీలలో స్థానిక మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న గిరి విద్యార్థి ప్రతిభ కనబరచి సత్తాచాటి రాష్ట్ర వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ వ్యక్తిగత క్రీడాకారుల పోటీలలో సెలెక్ట్ అయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి వంతల రమేష్ ద్వితీయ సంవత్సరంలో సీఈసీ గ్రూప్‌లో చదువుతున్నాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న కుడేలి రమేష్ బాబు శిక్షణ ఇచ్చారు. ఈయనది అరకువేలి మండలం తుడుం గ్రామం, గిరిజన నిరుపేద కుటుంబం. చదువుతో పాటు వాలీబాల్ క్రీడలో శ్రద్ధ చూపి రాష్ట్రస్థాయిలో సెలక్టయ్యారు. విద్యార్థి భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగి రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల డుంబ్రిగుడ ప్రిన్సిపాల్ మాకా వెంకటస్వామి నాయుడు కోరారు. విద్యార్థికి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తోటి కళాశాల విద్యార్థులు అభినందించారు.



వాలీబాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికైన రమేష్

ముగిసిన సూపర్ జిఎస్‌టి ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్‌లో సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ మరియు పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమల శ్రీ పూజ, పాడేరు మాజీ శాసన సభ్యుల గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడెమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ దొన్ను దొర, ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, అసిస్టెంట్ కలెక్టర్ .సాహిత్, వాణిజ్య ఉప కమిషనర్ పద్మజ , ఇంచార్జి ఆర్డీవో లోకేశ్వరరావు, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్లు రమేశ్ కుమార్, నూక రాజు, అచ్చయ్య పాల్గొన్నారు.

మాజీ ఆచార్యులు దివాకర్‌రాయ్ మృతి

ప్రజాశక్తి-మధురవాడ : ఆంధ్ర యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మాజీ ఆచార్యులు, సామాజిక వేత్త, ప్రముఖ హేతువాది డాక్టర్ కెవి.దివాకర్ రాయ్ (78) గుండె పోటుతో శనివారం మృతిచెందారు. అతని భౌతికకాయాన్ని సందర్శనార్థం పిఎం.పాలెం అశోకనగర్‌లోని వారి నివాసంలో ఉంచారు. దివాకర్‌రాయ్ నేత్రాలను దానం చేశారు. పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం గీతం మెడికల్ కళాశాలకు ఆదివారం కుటుంబ సభ్యులు అప్పగించారు.



ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందానికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

బోటు సిబ్బందికి విపత్తు అవగాహన

ప్రజాశక్తి - వి.ఆర్‌పురం: గోదావరి ఒడ్డున సంభవించే ప్రమాదాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. చింతూరు ఐటిడిఎ పిఒ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు పోచవరం టూరిజం బోటింగ్ పాయింట్ వద్ద ఆదివారం విపత్తు నిర్వహణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని వి.ఆర్.పురం తహసీల్దార్ ఎం.సరస్వతి ఆధ్వర్యంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం ఆర్ఐ రాము నాయకత్వంలో 34 మంది సిబ్బంది పాల్గొన్నారు. బోటు యజమానులు, సిబ్బందికి ప్రమాదం సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ఆపదలో ఎవరి ప్రాణాలు కోల్పోకుండా ఎలా రక్షించుకోవాలో ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. వాటర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ రెస్క్యూ, ఫస్ట్‌ఎయిడ్, సహాయ సూచనలు, స్థానిక అధికారుల మధ్య సమన్వయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ఆర్.పురం సంతోష్‌కుమార్, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆర్‌ఐరాము, ఇరిగేషన్ ఎఇ ఎం.రామకృష్ణ, విఆర్‌ఒ రామిరెడ్డి, బోటు యజమానులు ఎం.సత్తిబాబు, సూర్యప్రకాష్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



బురదమయంగా మారిన రహదారి

అధ్వానంగా శాండికోరి రహదారి

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామానికి రహదారి సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. సుమారు 65 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సిసి రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు కార్యదర్శి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ పాలకవర్గం స్పందించి వెంటనే శాండికోరి గ్రామానికి సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో ఆదివారం వర్షం కురవడంతో వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. చిరు వ్యాపారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. వరుసగా 3 ఆదివారాలు వారపు సంతలకు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వ్యాపారులు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరక్క నిరాశ చెందుతున్నారు.



సీలేరులో కురుస్తున్న వర్షం

రాష్ట్ర మ్యూజియంగా రుషికొండ ప్యాలెస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ ఫేర్ కమిటీ డిమాండ్ చేసింది. రుషికొండ భవనాలతో పబ్లిక్ హియరింగ్‌కు ఆంధ్రప్రదేశ్ టూరిజం సమాయత్తం కావడాన్ని వ్యతిరేకిస్తూ, ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రుషికొండ ప్యాలెస్ వివాదం హైకోర్టు విచారణలో ఉన్నందున వాటిపై తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర మ్యూజియం ఎక్కడా లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ముఖ్యంగా విశాఖకు చారిత్రక, సాంస్కృతికంగా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అనేక చారిత్రక ఆధారాలను హైదరాబాదు మ్యూజియంలో ఉంచారని గుర్తు చేశారు. బౌద్ధం విరాజిల్లిన ప్రాంతం ఇదని జైన్ అవశేషాలు కూడా ఇక్కడ ఉన్నాయన్నారు. కాబట్టి చారిత్రక, సాంస్కృతిక అంశాలతో పాటు భావితరాలకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా మ్యూజియంను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా జపాన్, వియత్నాం, చైనా, థాయిలాండ్, శ్రీలంక దేశాల నుండి అనేకమంది ఈ ప్రాంతంలో పర్యటించడానికి, ఈ మ్యూజియం సందర్శించడానికి అవకాశం కలిగి విదేశీ మారకద్రవ్యం అధికంగా లభిస్తుందని వివరించారు. అంతేకాకుండా కేంద్రం నుండి ప్రత్యేక నిధులు రాబట్టుకోవచ్చని తెలిపారు. ధర్నాలో కమిటీ అధ్యక్షుడు ఎం.మల్లయ్య రాజు, భానాస జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్‌ఫేర్ కమిటీ సభ్యులు

కెజిహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు

రూ.40 కోట్లతో కేన్సర్ విభాగానికి అధునాతన యంత్రాలు

'ప్రజాశక్తి'తో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి





ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన విశాఖపట్నం కెజిహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఇటీవల ఆమెను 'ప్రజాశక్తి' పలకరించినప్పుడు పలు విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఆధునిక కేన్సర్ వైద్య సేవలు ప్రారంభించినట్లు తెలిసింది.. ఎంతవరకు నిజం ?

కెజిహెచ్ కేన్సర్ విభాగంలో అత్యాధునిక వైద్య సేవలు ప్రారంభించాం. అందుకు అవసరమైన యంత్రాలను రూ.40 కోట్లతో ఏర్పాటు చేశాం. వీటిని సెప్టెంబర్ 1న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. వైద్యసేవలు కొనసాగుతున్నాయి.

అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్రాల్లో ఏమేమి ఉన్నాయి ?

ఆసుపత్రి రేడియో థెరఫీ విభాగానికి లీనాక్, సీటీ సిములేటర్, బ్రాకీ థెరఫీ యంత్రాలు ఉన్నాయి. నెల రోజుల వ్యవధిలో లీనాక్ యంత్రాలపై 25 మందికి, సీటీ సిములేటర్‌పై ఐదుగురికి పూర్తిస్థాయిలో సేవలు అందించాం. రేడియో థెరఫీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, సహ ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగ కుమారి, ఇతర వైద్యులు ఈ సేవలను అందిస్తున్నారు.

ఏయే రకాల కేన్సర్లకు వైద్యం అందుతోంది ?

పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉన్నందున అన్ని రకాల కేన్సర్లకు చికిత్స అందిస్తున్నాం. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు మెమోగ్రఫీ యంత్రం అందుబాటులో ఉంది. గర్భాశయం ద్వారా వచ్చే కేన్సర్లకు సంబంధించి ప్యాప్సీ నియర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ఏయే రకాల కేన్సర్లకు సంబంధించిన కేసులు వస్తున్నాయి ?

గొంతు, ముక్కు, చెవి, గర్భాశయ, బ్రెస్ట్, బ్రెయిన్ తదితర కేన్సర్ కేసులు వస్తున్నాయి.

బ్రాకీ థెరఫీ సేవలు గురించి వివరిస్తారా ?

అణుశక్తి నియంత్రణ బోర్డు (ఎంఆర్‌బి) అనుమతులు రాగానే ఈ సేవలను ప్రారంభిస్తాం. దీని ద్వారా గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌కు చికిత్స అందించవచ్చు.

కేన్సర్ రోగులు కెజిహెచ్‌కు ఏయే రోజుల్లో రావొచ్చు ?

అనుమానిత కేన్సర్ కేసులకు ప్రతి మంగళ, శని వారాలు కెజిహెచ్ సిఎస్ఆర్ బ్లాక్‌లో 200 ఒపి గదిలో ఒపి నిర్వహిస్తున్నాం.

చంద్రబాబును కలిసిన కెనరా బ్యాంకు ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెనరా బ్యాంకు అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఐటి రంగంలో అపార అవకాశాలు కలుగుతాయని చెప్పారు.. దీనికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతిలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కేంద్ర కార్యాలయాలకు స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



శాండికోరిలో పాడైన బోరు

బోరు బాగు చేయరూ..

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరిలో బోరు బావి మోటార్ మరమ్మతులకు గురైంది. గతవారం రోజుల నుంచి మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు బోర్ల నుంచి వచ్చిన గుక్కెడు నీటిని సేకరించి వడబోసి తాగుతున్నారు. ఇతర అవసరాలకు సీలేరు నదికి కాలినడకన వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. కొంత కాలం క్రితం ఇదే సమస్య ఎదురైతే దుప్పిలివాడ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి సకాలంలో మరమ్మత్తులు చేసి తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపట్టారు. మళ్లీ మోటారు మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ కేలేబు కుమారి స్పందించి మోటార్, బోరు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరా సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యుల సేవలు అమోఘం

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: సమాజంలో ఎంతోమందికి ప్రాణదాతలుగా నిలుస్తున్న వైద్యులను సత్కరించుకోవడం అభినందనీయమని విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఎంవిపి కాలనీలో ప్రముఖ పల్మనాలజిస్ట్ కేత ఫణిందర్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం పలువురు వైద్యులను గురువులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ ఫణీందర్ ఎంతో మంది ప్రాణాలు కాపాడారని, అదేవిధంగా ఇప్పుడు తన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరం, మందులు పంపిణీ చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. తన చేతుల మీదుగా ఎంతోమంది సీనియర్ ప్రముఖ వైద్యులను, గురువులను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. శిబిరం నిర్వహకులు డాక్టర్ ఫణిందర్ మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి ప్రజల కోసం లివర్ లంగ్స్ ఫంక్షన్, గుండెకి సంబంధించిన 16 రకాలు పరీక్షలను ఉచితంగా నిర్వహించామన్నారు. ఇందుకు మెడికవర్, ఇండస్ ఆసుపత్రుల యాజమాన్యం తమ వంతు సహకారం అందించినట్లు చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ సుధారాణి డాక్టర్ శ్వేత, డాక్టర్ మాఊరు కృష్ణమోహన్ వైద్యులు మాధవీలత, విద్యాసాగర్. తనకు విద్య నేర్పిన గురువులు వసుంధర, రోహిణి తదితరులందరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుగత సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, వార్డు అధ్యక్షులు సత్తిబాబు, జానాపురం హోల్‌సేల్ మార్కెట్ కమిటీ సభ్యులు కోరుబిల్లి ప్రసాద్, యువ వైద్యులు నీరజ్ ప్రసాద్, రవి, శ్రీనివాస్ తదితరులంతా పాల్గొన్నారు.

'డ్యూడ్' చిత్రబృందం విజయయాత్ర

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన 'డ్యూడ్' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అయ్యారు. మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా డ్యూడ్ మేకర్స్ విజయయాత్ర చేపట్టారు. విశాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'డ్యూడ్' సినిమాను అద్భుతంగా రిసీవ్ చేసుకుంటున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. 'డ్యూడ్ దివాళి బ్లాస్ట్' పేరిట నిర్వహించిన సక్సెస్ టూర్ విశాఖలో రామా టాకీస్, సంఘం శరత్ హాల్లో ఆడియన్స్‌తో ముచ్చటించారు. అనంతరం ఒక హోటల్లో జరిగిన మీడియా సమావేశంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'తమిళనాడులోనూ నా గత చిత్రాలకంటే 'డ్యూడ్'కు ఎక్కువ కలెక్షన్స్ వస్తున్నాయన్నారు.